‘వీధి వ్యాపారులకు న్యాయం జరిగేలా చూస్తా’

కంటోన్మెంట్‌: నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. గురువారం పలువురు వీధి వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. సికింద్రాబాద్‌ కోర్టు పరిసర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా టైపిస్టులు, స్టాంప్‌ వెండర్స్‌గా తాము జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. ఇటీవల ట్రాఫిక్‌ పోలీసులు తమను అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. ఉన్నపళంగా తమను ఖాళీ చేయిస్తే బతుకుదెరువు కోల్పోతామని వాపోయారు. తమకు తగిన న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. వీధి వ్యాపారులు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం లభించేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

మాదిగల కల సాకారమైంది

ఓయూ అభినందన సభలో పిడమర్తి రవి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 35 ఏండ్లుగా పోరాడిన మాదిగ కల సీఎం రేవంత్‌ రెడ్డితో సాకారమైందని కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు, ఎస్సీ కమిషన్‌ మాజీ చైర్మన్‌ డాక్టర్‌ పిడమర్తి రవి అన్నారు. గురువారం బహుజన్‌ స్టూడెంట్‌ ఫెరేషన్‌ (బీఎస్‌ఎఫ్‌) రాష్ట్ర కన్వీనర్‌ బోరెల్లి సురేష్‌ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సందర్భంగా జరిగిన అభినందన సభలో పిడమర్తి రవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ... ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించి తెలంగాణ చరిత్రలో సీఎం రేవంత్‌ రెడ్డి స్థిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థి, ఉద్యోగులు, విద్యావంతులు సీఎం వెంటే ఉంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్‌ అధినేత మంద కృష్ణ మాదిగ తన ఉద్యమ కాలంలో ఎన్నడు 11 శాతం రిజర్వేషన్లను అడగలేదని కేవలం బీజేపీ నేతల మెప్పు కోసమే 9 నుంచి 11 శాతం పెంచాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజవర్గాల కేంద్రాల్లో సీఎం రేవంత్‌ రెడ్డికి కృతజ్ఞత సభలను నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన పిడమర్తి రవి భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఉద్యమించాలని బోరెల్లి సురేష్‌ ఆకాంక్షించారు. నేతలు మల్లేశం, నంద్రు నర్సింహ మాదిగ, వడ్డే ఎల్లన్న, రామగల సుందర్‌, కాంగ్రెస్‌ నేత బొమ్మెర స్టాలిన్‌, ప్రసాద్‌, రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌తో అసభ్య ప్రవర్తన..వ్యక్తి రిమాండ్‌

లాలాపేట: ట్రాఫిక్‌ విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 5న నల్లకుంట ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌కు చెందిన ఓ మహిళా కానిస్టేబుల్‌ తన విధి నిర్వహణలో భాగంగా తార్నాకలో హెల్మెట్‌ ధరించని ద్విచక్ర వాహనదారులు, నెంబర్‌ ప్లేటు లేని వాహనాల ఫొటోలు తీస్తోంది. ఈ క్రమంలో అటు వైపు వచ్చిన పృథ్వీరాజ్‌(30) అనే వ్యక్తి ఫొటో తీస్తుండగా ఆమె పట్ల చేతి వేలు అసభ్యకరంగా చూపుతూ అనుచితంగా ప్రవర్తించాడు. దీనిపై కానిస్టేబుల్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి పృథ్వీరాజ్‌కు 14 రోజుల రిమాండ్‌ విధించారు. నిందితుడు పృథ్వీరాజ్‌ ఏబీవీపీ కార్యకర్తగా పోలీసులు పేర్కొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్‌: కుటుంబంతో కలిసి బయటకు వెళ్లొచ్చే సరికి బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12లోని కిమ్టీ బంజారా హైట్స్‌లో నివసించే దీపక్‌కుమార్‌ కిమ్టీ గత నెల 22న కుటుంబంతో కలిసి బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చే సరికి వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. డెస్క్‌పై ఉంచిన తొమ్మిది గ్రాముల బంగారం, వజ్రం ఉంగరం కనిపించలేదు. ఇంట్లో పనిచేసే రాహుల్‌కుమార్‌ను ప్రశ్నించగా తెలియదని చెప్పాడు. అయితే.. కొన్ని రోజులకు రాహుల్‌ చెప్పకుండా స్వస్థలమైన బిహార్‌కు వెళ్లిపోయాడు. అతడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెనకబడ్డ కులాలకు 3 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డికి కృతజ్ఞతలని అదే సమయంలో ఎస్సీ ‘ఎ’ కేటగిరిలో 15 సంచారజాతులను చేర్చి మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగం, ఉపాధి, ఆర్థికంగా ముందున్న పంబాల, మన్నే కులాలను ఎస్సీ ఎ కేటగిరి నుంచి తొలగించాలని వారి స్థానంలో వెనకబడ్డ కులాలైన దాసరి, హోలియ దాసరి కులాలను ఎ జాబితాలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, సహదేవుడు, పరుషరాం, వెంకటి, రాజేష్‌, శివ, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ రసాభాస

- రాజకీయ వేదికగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీ
- కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ కార్యకర్తల పోటాపోటీ నినాదాలు
- రెండు గంటల పాటు లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌.. కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ఆదం పరస్పర ఆరోపణలు



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌

అడ్డగుట్ట: తుకారాంగేట్‌ పరిధిలోని రియో పాయింట్‌ వద్ద గురువారం నిర్వహించిన సికింద్రాబాద్‌ నియోజకవర్గ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా సాగింది. అధికార కాంగ్రెస్‌, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తల మధ్య వాదప్రతివాదాలు, పరస్పర ఆరోపణలతో కార్యక్రమం ఉద్రిక్తతల నడుమ సాగింది. నియోజకవర్గం పరిధిలో లబ్ధిదారులకు సుమారు రూ. 91 లక్షల విలువైన 91 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కులను పంపిణీ జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఈ కారణంగా ఉదయం 10 గంటలకు వచ్చిన లబ్ధిదారులు మధ్యాహ్నం 12 గంటల వరకు చెక్కుల పంపణీ కోసం ఎదురుచూస్తూ విసిగిపోయారు. ఎట్టకేలకు చెక్కుల పంపిణీ జరగడంతో వాటిని తీసుకొని వెళ్లిపోయారు.

- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ డిప్యూటీ స్పీకర్‌, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేద యువతులకు పెళ్లిళ్ల ఖర్చును ప్రభుత్వం భరించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామనే హామీని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అమలు కాని హామీలిచ్చి కాంగ్రెస్‌ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వ ఎన్నికల హామీలు ఏమయ్యాయని లబ్ధిదారులు తమను ప్రశ్నిస్తున్నారన్నారు.
- బీసీ జనాభా గుర్తింపునకు తాము అనుకూలమని, అయితే ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని తప్పుల తడకగా మార్చిందన్నారు. ఓబీసీ కుల నాయకుడిగా తాను బీసీల న్యాయపరమైన ప్రయోజనాలను స్వాగతిస్తానని, ప్రభుత్వం కుల గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించకుండా అభాసుపాలు చేసిందని ఆరోపించారు.
- కేసీఆర్‌ నేతృత్వంలో బీఆర్‌ఎస్‌ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని పద్మారావుగౌడ్‌ జోస్యం చెప్పారు. అడ్డగుట్ట అంటే పద్మారావుగౌడ్‌ అడ్డా అని ఆయన స్పష్టం చేశారు.
- కాంగ్రెస్‌ పార్టీ సికింద్రాబాద్‌ నియోజకవర్గ ఇంచార్జి ఆదం సంతోష్‌కుమార్‌ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పాలన సాగిస్తున్నారన్నారు. అందులో భాగంగానే దశలవారీగా అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. సికింద్రాబాద్‌ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన పద్మారావుగౌడ్‌ను ఆ తరువాత ఆరు నెలలకే జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో మూడో స్థానానికి నగర ప్రజలు నెట్టేశారని



వాగ్వాదం చేసుకుంటున్న నాయకులు

ఆయన గుర్తుచేశారు. అంతే కాకుండా తన అడ్డా అని చెప్పుకునే అడ్డగుట్టలో సైతం కాంగ్రెస్‌ లీడ్‌లో నిలిచిందన్నారు. తానూ అడ్డగుట్ట ముద్దుబిడ్డనే అని, వచ్చే గ్రేటర్‌ ఎన్నికల్లో పద్మారావుగౌడ్‌ ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్‌ నియోజకవర్గంలోని డివిజన్లలో ఒక్క కార్పొరేటర్‌ సీటును కూడా గెలవనివ్వమని ఈ సందర్భంగా సంతోష్‌ పేర్కొన్నారు.

- డిప్యూటీ మేయర్‌ మోతె శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు లింగాని ప్రసన్న, కంది శైలజ, తహసీల్దార్‌ భీమయ్య గౌడ్‌, కాంగ్రెస్‌ నేతలు గంట రాజుసాగర్‌, శివకుమార్‌, బీఆర్‌ఎస్‌ నేతలు రామేశ్వర్‌గౌడ్‌, లింగాని శ్రీను, శ్రీనివాస్‌గౌడ్‌, అమర్‌, మనోహర్‌, మధుగౌడ్‌, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని కార్పొరేటర్‌ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని ఎస్సార్టీకాలనీ, ఎంఐజీకాలనీల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ..మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులను చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ డివిజన్‌ను సుందరీకరణగా తీర్చిదిద్దడానికి తమ శక్తి మేరకు పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సాయిసందీప్‌, జమీల్‌పాషా, భాస్కర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్‌, బాలు, మహేశ్వరి, అనంతరెడ్డి, విష్ణు, నరేందర్‌రెడ్డి, శ్రీను, వరప్రసాద్‌ పాల్గొన్నారు.

‘నిరుపేదల కలలను సాకారం చేసేలా కేంద్ర బడ్జెట్‌’



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వెల్లాల రామ్మోహన్‌

సనత్‌నగర్‌: నిరుపేద కలలను సాకారం చేసేవిధంగా ప్రధాని మోదీ బడ్జెట్‌ ఉందని బీజేపీ సీనియర్‌ నేత వెల్లాల రామ్మోహన్‌ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగే విధంగా బడ్జెట్‌ను రూపొందించారంటూ మోదీ చిత్రపటానికి గురువారం ఆయన పాలాభిషేకం చేశారు. సనత్‌నగర్‌ స్వామి సోలిటేర్‌ అపార్ట్‌మెంట్స్‌ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వెల్లాల రామ్మోహన్‌ మాట్లాడుతూ..పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకునే విధంగా 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ రూపొందించారన్నారు. ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో దేశంలో వెనుకబడిన 100 జిల్లాలను గుర్తించి ఆ జిల్లాల సమగ్ర అభివృద్ధికి కృషి చేసే అద్భుత పథకమన్నారు. కిసాన్‌ క్రెడిట్‌ కార్డు రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంచడంతో రైతాంగానికి ఎంతో లాభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు కృష్ణచైతన్య, నాయకులు సుబ్బారావు, రాంప్రసాద్‌, శ్రీనివాస్‌, రవి చిటుకుల, రాజేంద్రచారి, చిన్నమ్మ, అనురాధ, మురళీ కిషోర్‌, బాలాజీ, లక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌బిన్‌.. పరిసరాలు క్లీన్‌

- చెత్త పేరుకుపోయే చోట్ల మళ్లీ డంపర్‌ బిన్లు
- నిండుతుండగానే అప్రమత్తం చేసే సెన్సార్లు
- సర్కిళ్ల వారీగా జీవీపీల గుర్తింపు



కొత్తగా మంజూరైన స్మార్ట్‌ బిన్‌..

బంజారాహిల్స్‌: రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త సమస్య రోజుకురోజుకు తీవ్రతరమవుతుంది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రోడ్ల పక్కన చెత్త వేసే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. చెత్తరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ సర్కిల్‌–17, జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 పరిధిలో ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీల్లో భారీగా చెత్త పేరుకుపోతుంది. ఈ నేపథ్యంలో తరచూ చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో (గార్బేజ్‌ వల్లరబుల్‌ పాయింట్లు) చెత్త లేకుండా సమస్య పరిష్కారానికి గతంలో నిషేధించిన డంపర్‌ బిన్లు (చెత్త డబ్బాలు) మళ్లీ అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

1100 లీటర్ల సామర్థ్యంతో..

సర్కిల్‌–17, 18లో సుమారుగా 73 జీవీపీలను గుర్తించి ఈ మేరకు డంపర్‌ బిన్లు కేటాయించారు. కొత్తగా మంజూరైన ఈ డంపర్‌ బిన్లు ఒక్కొక్కటి 1100 లీటర్ల సామర్థ్యంతో ఉండగా గార్బేజ్‌ వల్లరబుల్‌ పాయింట్ల వద్ద ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఎక్కడెక్కడ వీటిని ఏర్పాటు చేయాలో అధికారులు సంబంధిత డీసీలు, ఏఎంఓహెచ్‌లకు జాబితా అందజేశారు. అడ్వాన్స్‌ ట్రాకింగ్‌ సిస్టమ్స్‌ (ఆర్‌ఎఫ్‌ఐడీ) విధానంలో ఈ డస్‌బిన్ల పర్యవేక్షణ జరగనున్నాయి.

70 శాతం చెత్త పడగానే అప్రమత్తం చేసేలా..

బిన్లలో 70 శాతం చెత్త పడగానే ఆర్‌ఎఫ్‌ఐడీ సెన్సార్‌ ద్వారా ఆ రూట్‌లో ఉన్న స్వచ్ఛ ఆటోను అప్రమత్తం చేస్తోంది. దీంతో ఆ రూట్‌లో వెళ్లే వాహనాలు ఈ బిన్లలో నిండుకున్న చెత్తను శుభ్రపరుస్తాయి. దీని ద్వారా బిన్లు నిండేదాకా కాకుండా 30 శాతం ఉండగానే తొలగించడంతో అక్కడ వీధి కుక్కలు చిందరవందర చేసే అవకాశాలు ఉండవని భావిస్తున్నారు. ఖైరతాబాద్‌ జోన్‌లో 76 జీవీపీల వద్ద 166 బిన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ బిన్ల ఏర్పాటు వల్ల సాధ్యమైనంతగా జీవీపీలను తగ్గించాలని ప్రణాళికలు రూపొందించారు.డంపర్‌ బిన్ల పర్యవేక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్‌ 35, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 10, క్యారెట్‌ 18, దొండ 23, గుండుబీన్స్‌ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 19, బీట్‌రూట్‌ 18, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 7, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 4–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌ జీఆర్‌పీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ ఫాం నంబర్‌–6లో బుధవారం రాత్రి సుమారు 35–40 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, బ్లూ కలర్‌ జీన్స్‌ ప్యాంట్‌, బ్లూ కలర్‌ టీషర్ట్‌ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో...

బీబీనగర్‌ నుంచి ఘట్‌కేసర్‌ రైల్వే స్టేషన్‌ వెళ్లే మార్గం మధ్యలోని పట్టాలపై బుధవారం రాత్రి సుమారు 35 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు లైట్‌ కలర్‌ గ్రీన్‌ షర్ట్‌, లైట్‌ కలర్‌ బ్లూ జీన్స్‌ ప్యాంట్‌ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

రూ. 100 కోట్ల ట్యాక్స్‌ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య

బన్సీలాల్‌పేట్‌: బేగంపేట్‌ సర్కిల్‌ పరిధిలో రూ.100 కోట్ల ట్యాక్స్‌ వసూళ్ల లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేస్తామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య వెల్లడించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ట్యాక్స్‌ వసూళ్ల కోసం ఓ నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకుసాగుతున్నామన్నారు. ఇప్పటికే రూ.73 కోట్ల ట్యాక్స్‌ను వసూలు చేశామన్నారు. ఈ ఫిబ్రవరి చివరి వరకు మరో రూ.12 కోట్లు పూర్తి చేస్తామని తెలియజేశారు. కోర్టు, ఇతరత్రా కేసుల కారణంగా పలు ఏరియాల్లో ట్యాక్స్‌ వసూళ్లకు గుదిబండగా మారిందన్నారు. అన్ని రకాల సమస్యలను అధిక మించి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. గత సంవత్సరం బేగంపేట్‌ సర్కిల్‌ పరిధిలో రూ. 100 కోట్ల ట్యాక్స్‌ లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. ఈ సంవత్సరం కూడా సదరు లక్ష్యాన్ని చేరుకుంటామనే డిప్యూటీ కమిషనర్‌ ధీమా వ్యక్తం చేశారు. ట్యాక్స్‌ సిబ్బందిని ఎప్పకప్పుడూ అప్రమత్తం చేస్తూ వసూళ్లను వేగవంతం చేశామన్నారు. ట్యాక్స్‌ వసూళ్ల కోసం ఇప్పటికే స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నామని వివరించారు. ట్యాక్స్‌ అధికారులు, సిబ్బందితో పాటు ఇతర విభాగాల సిబ్బందిని ట్యాక్స్‌ వసూళ్ల కోసం వారి సేవలను కూడా ఉపయోగించుకుంటున్నామని తెలియజేశారు. ఇప్పటికే తమ సిబ్బంది ట్యాక్స్‌ కలెక్షన్లలో నిమగ్నమై పని చేస్తున్నారన్నారు. ట్యాక్స్‌ వసూలు కార్యక్రమంలో తమ సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా ఎక్కడ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య వివరించారు. మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి గాను ట్యాక్స్‌ వసూళ్లల్లో 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థుల సామాజిక సేవ



పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులు

రసూల్‌పురా: స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, సామాజిక సేవతో పాటు దేశభక్తి విలువలను పెంపొందించుకుంటారని పికెట్‌ కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ రూపిందర్‌ సింగ్‌ పేర్కొన్నారు. థింకింగ్‌ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా స్కౌట్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులు గురువారం పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. స్కౌట్‌ అండ్‌ గైడ్స్‌ వారి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి మంచి పౌరుడిగా ఎదగడానికి నేర్పుతుందన్నారు. స్కౌట్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా చౌరస్తాల్లో ట్రాఫిక్‌ నియంత్రణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. లీ ప్యాలెస్‌ రాయల్‌ భవనాన్ని సందర్శించి చరిత్రను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్‌ మధుసూదన్‌, వర్షినియ సుందర్‌ రాజ్‌, సూర్యనారాయణ, ఆశీష్‌, సోనియా, ఎల్‌కే, సురా తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ నిర్మాణాన్ని పూర్తి చేయాలి



ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సేవాదళ్‌ నాయకులు

అడ్డగుట్ట: పెండింగ్‌లో ఉన్న అడ్డగుట్ట ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని తెలంగాణ కాంగ్రెస్‌ సేవాదళ్‌ నాయకులు కోరారు. అడ్డగుట్టలోని మసీదు సమీపంలో నిలిచిపోయిన ఫంక్షన్‌ హాల్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సంగీత మాట్లాడుతూ... సుమారు నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడం విడ్డూరమన్నారు. చిన్న చిన్న సమావేశాలు, శుభకార్యాలకు ఎంతో అనువుగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను కూల్చివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సేవాదళ్‌ నాయకులు రామలీల, రవి, లక్ష్మణ్‌ చారి, పద్మ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం



పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘం నాయకులు

అమీర్‌పేట: ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందని అమీర్‌పేటకు చెందిన దళిత సంఘం నాయకులు అన్నారు. వర్గీకణకు తెలంగాణ శాసన సభ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం బల్కంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం నేత కొమ్ము రవీందర్‌ మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్ల నుంచి చేస్తున్న ఉద్యమానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందని చెప్పారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉండటం సంతోషదాయకమని తెలిపారు. దళిత సంఘం నాయకులు గోవింద, మిరియాల రాజు, నర్సింహ, పాండు, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణ చేయడం సరికాదు

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్‌ వి.ఎల్‌.రాజు ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఏబీసీడీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదముద్ర వేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గురువారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్‌ షమీం సారథ్యంలోని ఏకసభ్య కమిషన్‌ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం అంటే రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. గతంలో నాలుగు గ్రూపులుగా ఉంటే ప్రస్తుతం మూడు గ్రూపులుగా రిజర్వేషన్‌ అమలు చేయాలని కమిషన్‌ నివేదిక ఇవ్వటాన్ని తప్పుపట్టారు. మాదిగలకు 9 శాతం, మాలలకు ఐదు శాతం ఇతర ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్‌ నివేదికలో పేర్కొందని ప్రభుత్వం ఆ దిశగా అమలు చేసేందుకు కసరత్తులు చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగంలోని 341 ప్రకారం వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికి రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మాలలకు ద్రోహం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



పార్కు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని, డిప్యూటీ మేయర్‌ శ్రీలత

బన్సీలాల్‌పేట్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ పేర్కొన్నారు. పద్మారావునగర్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో రూ. 57.5లక్షలతో చేపడుతున్న వివిధ ప్రజాభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ మేయర్‌ శ్రీలత, కార్పొరేటర్‌ హేమలత, కాంగ్రెస్‌ నాయకురాలు కోట నీలిమతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ..పద్మారావునగర్‌ పార్కు పక్కనున్న రోడ్డు గోతులమయంగా ఉందని రూ.12.5లక్షలతో నూతన సీసీ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. వెంకటాపురం కాలనీలో రూ.42 లక్షలతో నూతన సీసీ రోడ్డు వేస్తున్నామన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న పార్కును రూ.3 లక్షలతో ఆధునీకీకరిస్తున్నట్లు వివరించారు. పద్మారావునగర్‌ పార్కు వద్ద రోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకుల మధ్య మాటల యుద్ధం సాగింది. బీఆర్‌ఎస్‌ నాయకులు ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ బ్యానర్లు కట్టడం ఏమిటని కాంగ్రెస్‌ నాయకులు బీఆర్‌ఎస్‌ శ్రేణులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య, డిప్యూటీ డీఈ ఆంజనేయులు, జలమండలి ఆశీష్‌, విద్యుత్తు శాఖ ఏడీ మహేష్‌లతో పాటు బీఆర్‌ఎస్‌ నాయకులు గుర్రం పవన్‌కుమార్‌ గౌడ్‌, ఏసూరి మహేష్‌, లక్ష్మీపతి, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, పుష్పంత్‌రెడ్డి, వెంకట్‌ ముదిరాజ్‌, చారీ, మహేందర్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు..

సనత్‌నగర్‌ నియోజకవర్గంలో రూ.5 కోట్లతో వివిధ ప్రజాభివృద్ధి పనులను పడుతున్నట్లు సనత్‌నగర్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కోట నీలిమ వెల్లడించారు. ఆమె గురువారం బన్సీలాల్‌పేట్‌లో విలేకర్లతో మాట్లాడారు. కొన్ని పనులు అమలు జరుగుతుండగా, మరి కొన్ని ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు డాక్టర్‌ శివకుమార్‌ లాల్‌, మల్లం రమేష్‌, గంటా సుధీర్‌ కుమార్‌, రమేష్‌, శ్రీనివాస్‌, కృష్ణముదిరాజ్‌, లవ తదితరులు పాల్గొన్నారు.